ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 7 జూలై 2025

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



రామ్‌నగర్‌లో విశేషాలంకరణలో రుక్మిణీసమేత పాండురంగస్వామి

అనంతపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, రామ్‌నగర్‌లోని రుక్మిణీసమేత పాండురంగ స్వామి దేవాలయంతోపాటు తదితర ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు గావించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని, మొక్కుకున్నారు.

మన్నీలలో పర్యటించిన డీఎల్‌పీఓ



మన్నీల ఎస్సీకాలనీకి వెళ్లేదారిలోని కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలో విష జ్వరాల వ్యాప్తిపై 'చలి, జ్వరం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. డీఎల్‌పీఓ విజయకుమార్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. జిల్లా మలేరియా విభాగ సిబ్బంది గ్రామంలోని పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను తొలగించారు. నీటి ట్యాంకును శుభ్రం చేయించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, కాలువల్లో స్ప్రేయింగ్ చేయించారు. పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ సూచించారు. గ్రామస్థులతో సమావేశమై, మాట్లాడారు.

10న మెగా పీటీఎం

- అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహణ
- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈనెల 10వ తేదీన మెగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం (పీటీఎం 2.0) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. 1వతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంస్థల్లో, మోడల్‌స్కూళ్లు, కేజీబీవీ, సంక్షేమ వసతి గృహాల్లో పీటీఎం నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, దాతలు, పూర్వవిద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదయ్యేలా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ పాల్గొన్నారు.



జంట ఆలయాల ముందు భక్తులు



ప్రత్యేక అలంకరణలో గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు



దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

జనసంద్రం.. గూగూడు

- పెద్ద సరిగెత్తుకు భారీగా వచ్చిన భక్తులు
- నియంత్రించలేక ఇబ్బందిపడ్డ పోలీసులు

నార్పల, జూలై 6(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం పెద్ద సరిగెత్తు కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి విచ్చేసి చక్కెర చదవింపులు, ఫాతేహాలు, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామికి వెండి గొడుగులు సమర్పించారు. ట్రాక్టర్లలో మొద్దులు తీసుకువచ్చి అగ్నిగుండంలో వేశారు. అగ్నిగుండం చుట్టూ పొర్లుదండాలు చేసి పానకాలు సమర్పించారు. పెద్దసరిగెత్తు కావడం వల్ల ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేయడంతో గూగూడు నిండుకుండలా మారింది. ఆలయం ముందు భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో పోలీసులు భక్తులను కంట్రోల్ చేయలేక నానా తంటాలు పడ్డారు. భక్తులకు థియేటర్ భాస్కర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్ద సరిగెత్తు కావడం వల్ల భక్తులు రాత్రంతా జాగరణ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు మారుతిస్వామి దర్శించుకున్నారు. వైసీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, పలువురు మండల స్థాయి నాయకులు స్వామిని దర్శించుకున్నారు.



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

నేడు జలధి

గూగూడు కుళ్లాయిస్వామికి సోమవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శోభ తెలిపారు. తెల్లవారుజామున కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం చేస్తారని, సాయంత్రం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో జలధి కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమతాదేవి, మండల అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.





చల్లగా చూడు కుళ్లాయిస్వామి...

మా గోడు పట్టదా..!

ఏటా పంటలు.. జింకల పాలు..

ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

రేయింబవళ్లూ పొలాల్లో రైతుల పడిగాపులు



కంది పొలంలో జింకల మంద

విడపనకల్లు, జూలై 6(ఆంధ్రజ్యోతి): వేల సంఖ్యలో జింకలు.. ఒక రాత్రి ఏమరపాటుగా ఉన్నా.. ఎకరాల్లోని పంట ఖాళీ. వాటి బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు రేయింబవళ్లూ పొలాల్లో కాపలా ఉంటున్నారు. వాటి బెడద తప్పించాలని మండలంలోని పెద్దకొట్టాలపల్లి రైతులు.. జిల్లా కేంద్రంలో అటవీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు ఏడు నెలల క్రితం పెద్ద కొట్టాలపల్లి పొలాల్లోని జింకలను పరిశీలించారు. జింకలను విడతల వారీగా అడవులకు తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆ తర్వాత వారు ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో రైతుల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. మళ్లీ ఖరీఫ్ పంటకాలం ప్రారంభమైనా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వేల సంఖ్యలో జింకలు ఉన్నాయనీ, రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

పొలంలోనే ఉంటున్నా..: పాల ఎర్రిస్వామి, పెద్దకొట్టాలపల్లి



ఐదు ఎకరాల్లో కంది పంట సాగు చేస్తున్నా. మందలుగా జింకలు వస్తాయి. కొద్దిసేపు మనిషి కాపాలా లేకపోతే ఎకరాల్లోని పంటను తినేస్తాయి. అందుకే రోజూ పొలం వద్ద కాపాలాగా ఉంటున్నా. అధికారులు మా కష్టాలను గుర్తించి జింకలను అరికట్టాలి.

చాలా నష్టపోయా: చిన్న వెంకటేశులు, పెద్దకొట్టాలపల్లి



ఏటా 15 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది పంట సాగు చేస్తున్నా. గతేడాది జింకల దాడిలో దాదాపుగా ఎనిమిది ఎకరాలు కంది పంటను కోల్పోయా. ఈసారి కూడా 15 ఎకరాల్లో కంది సాగు చేశా. ఒక్కసారి జింకల మంద పొలంలోకి వస్తే ఎకరం పొలంలో ఒక మొక్క కూడా మిగలదు. జింకల సమస్యను తొలగిస్తామని గతేడాది అధికారులు చెప్పారు. ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

భయంగా ఉంది: ఎం గోపాల్, పెద్దకొట్టాలపల్లి



ఏటా 25 ఎకరాలకుపైగా కంది, పప్పుశనగ పంటలు సాగు చేస్తా. కంది పంటకు పెట్టుబడులు తక్కువ, దిగుబడులు బాగానే ఉంటాయి. దీంతో కంది పంటను ఎక్కువగా సాగు చేస్తా. జింకల నుంచి పంటను కాపాడుకోలేకపోతున్నా. వేల సంఖ్యలో జింకలున్నాయి. ఒక్కరాత్రి జింకలు పడ్డాయంటే.. పొలం మొత్తం ఖాళీ అవుతుంది. అధికారులు స్పందించాలి.

లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు

అనంతపురం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు లాడ్జిలు, హోటళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆదివారం రాత్రి పలువురు సీఐలు, ఎస్ఐలు.. సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేశారు. నేరాల నియంత్రణ కోసం, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని లాడ్జిలు, హోటళ్లు, డాబాల్లో తనిఖీలు చేశారు. గదులను క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు, లాడ్జిలు, హోటళ్లలో బసచేసిన వ్యక్తుల వివరాలను ఆరాతీశారు. లాడ్జిలు, హోటళ్లలో బసచేసే వ్యక్తుల ఆధార్ వివరాలు ఇతర సమాచారాన్ని రిజిస్టర్లలో నమోదు చేయాలని పోలీసులు.. వాటి యజమానులను ఆదేశించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలనీ, చట్ట విరుద్ధంగా ఎవరికీ లాడ్జిల్లో గదులు ఇవ్వకూడదని హెచ్చరించారు.



తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు

బదిలీ చేసేరా...?

- ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు
- సొంత మండలానికి దూరంగా విధులు

7

కేజీబీవీ ఘటనపై జేసీ
విచారణ
7

పెద్ద సరిగెత్తులో అపశ్రుతి
పీర్ల సవారి ఎత్తిన వ్యక్తి గుండెపోటుతో మృతి
7

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు అపహరణ
7

కార్పొరేషన్ ఖాళీ..!

- కీలక పోస్టుల్లో అధికారులు లేని దుస్థితి
- కుంటుపడుతున్న పాలన
- అటకెక్కిన సమస్యల పరిష్కారం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): 74వేల ఇళ్లు, 3లక్షలకుపైగా జనాభా ఉన్న అనంత నగర పాలక సంస్థ ఖాళీగా దర్శనమిస్తోంది. ప్రధాన పోస్టుల్లో అధికారులు లేరు. కొన్నింటికి ఇన్‌చార్జిలను నియమించగా.. మరి కొన్నింటిని ఖాళీగా వదిలేశారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ), ఏసీపీ, మేనేజర్, అదనపు కమిషనర్, ఎస్ఈ ఇలా అన్ని కీలక పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజల సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారు. నగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నా నియంత్రించే నాథుడే లేడు.

కీలక పోస్టులన్నీ ఖాళీ

నగరపాలక సంస్థలో కీలక పోస్టులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండడంలో సెక్రటరీ రంగస్వామికి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. అదనపు కమిషనర్, టౌన్ ప్లానింగ్‌లో ఏసీపీ, టీపీఓ, టీపీఈఎస్, టీపీబీఓ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. టీపీఓ శిరీషకే ఏసీపీఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరో టీపీఓ మంజుళక్కను వివిధ ఆరోపణలతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఎస్ఈగా ఉన్న చంద్రశేఖర్ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. రెండు ఈఈ పోస్టులకుగాను ఒక్కరే ఉన్నారు. పరిపాలనలో కీలకంగా ఉండే మేనేజర్ పోస్టు కూడా ఖాళీగానే దర్శనమిస్తోంది. రెవెన్యూ విభాగంలో సుమారు 16ఏళ్లపాటు పనిచేసిన సుజాతకు మేనేజర్‌గా బాధ్యతలు ఇచ్చినా.. వివిధ ఆరోపణలతో ఆమెను తప్పించారు. అధికారులు లేకపోవడంతో పాలన పడకేసింది. ఉన్న అధికారుల మధ్య కూడా సమన్వయం కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఖాళీగా దర్శనమిస్తున్న మేనేజర్ సీటు

ఖాళీలు ఉన్న మాట వాస్తవమే



నగరపాలక సంస్థ పరిధిలో చాలా పోస్టులు ఖాళీ ఉన్న మాట వాస్తవమే. ఉన్నతాధికారులకు పరిస్థితిని నివేదించాం. ఉన్నవారితో సక్రమంగా పనిచేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం.

-బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్

ఇంటి పట్టా.. అనర్హుల పుట్ట!

- జాబితాలో వైసీపీ నాయకుల బినామీ పేర్లు
- కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు, అపార్టుమెంట్ ఓనర్లు కూడా పేదలే..
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- చేతులు మారిన రూ.కోట్లు

జగనన్న లే అవుట్ ముసుగులో దోపిడీ.. రూ.కోట్ల విలువైన స్థలాలు స్వాహా

పుట్టపర్తి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగనన్న లేఅవుట్ల ముసుగులో వైసీపీ నాయకులు రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలను స్వాహా చేశారు. రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై, రూ.కోట్లు కొల్లగొట్టారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో 2021 సంవత్సరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 121, 143, 144, 145, 146 సర్వే నంబర్లలో 32 ఎకరాల భూమిని సేకరించారు. జగనన్న లేఅవుట్ పేరుతో 1,895 మందికి ఒక్కొక్కరికి సెంటు భూమి చొప్పున పట్టా ఇచ్చారు. పేదల ముసుగులో వైసీపీ నాయకులే అత్యధిక భాగం ఇంటి స్థలాలు పొందారు. అందులోనూ పుట్టపర్తి మున్సిపాలిటీలో లేనివారికి కూడా పట్టాలిచ్చారు. ఇళ్ల స్థలాలు పొందినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, పొరుగు మండలాల, పక్క జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు, నియోజకవర్గంలోని కాంట్రాక్టర్లు, బిల్డర్లు, అపార్టుమెంట్ ఓనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారు ఉండడం గమనార్హం.



లేఅవుట్ మధ్యలో ఖాళీ స్థలం

లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమి

బ్రాహ్మణపల్లి జగనన్న లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమిని ఉంచారు. ఈ భూమి చుట్టూ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పేదలకు మాత్రం సెంటు చొప్పున భూమి ఇచ్చిన రెవెన్యూ అధికారులు, ఖాళీగా ఉంచిన ఈ భూమిలో ఒక వైసీపీ నాయకుడికి మూడు నుంచి ఐదుసెంట్ల భూమిని పట్టాలుగా ఇవ్వడం విశేషం. ఉద్దేశపూర్వకంగానే లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమిని ఉంచి విలువ వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులు.. వైసీపీ నాయకులకు పట్టాలిచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఐదు సెంట్లలో పునాదులు వేసి అమ్ముకున్నారు.

బినామీల పేరుతో పట్టాలు

పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లిలో జగనన్న లేఅవుట్‌ను కేవలం వైసీపీ నాయకులు, సానుభూతి పరుల కోసమే ఏర్పాటు చేసినట్లు తేటతెల్లమవుతోంది నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై. బినామీల పేరుతో పదుల సంఖ్యలో ఇంటిపట్టాలు పొందారు. పుట్టపర్తిలో నివాసంలేని అనేక మంది వైసీపీ నాయకులకు ఈ లేఅవుట్‌లో అప్పనంగా స్థలాలు అప్పగించారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన ఓ మహిళ, వైసీపీ కౌన్సిలర్లు.. బినామీల పేరుతో పాతిక ఇంటి పట్టాలు తీసుకున్నట్లు సమాచారం. ఓ కాంట్రాక్టర్ ఏకంగా 40 ఇంటి పట్టాలను బినామీల పేరుతో స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా బినామీల పేర్లతో ఇళ్ల స్థలాలు తీసుకుని, తరువాత వాటిని ఒక్కొక్కటి రూ.ఐదులక్షల చొప్పున విక్రయించారు. ఈ స్థలాలు ఇప్పటికే అనేకమంది చేతులు మారాయి. జగనన్న లేఅవుట్, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారులు కూడా భారీ మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం. ఈ లేఅవుట్‌లో బినామీలకు ఇంటి స్థలాలిచ్చి, భారీగా (మిగతా 7లో...)

పెద్ద సరిగెత్తులో అపశృతి

- పీర్ల సవారి ఎత్తిన వ్యక్తి గుండెపోటుతో మృతి


ఖయ్యూం (ఫైల్)

గుంతకల్లుటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన పెద్ద సరిగెత్తు కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. పీర్ల సవారి ఎత్తిన ముల్లా ఖయ్యూం (48) గుండె పోటుతో మృతిచెందాడు. ఖయ్యూం వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక తాటాకుల వీధిలో పెద్దచావిడిలో పీర్లు కొలువుదీరాయి. 30 సంవత్సరాలుగా ఖయ్యూం పీర్ల సవారిని ఎత్తుతున్నాడు. ఉదయం లాల్‌స్వామి పీరును ఖయ్యూం ఎత్తి కొద్దిసేపటికి మరొకరికి ఇచ్చాడు. ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పి మకాన్ సమీపంలోని జెండా కట్ట వద్దకు వెళ్లి కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పీర్లను తిలకించేందుకు వచ్చిన భక్తులు షాక్ గురయ్యారు. పీర్ల సవారి ఎత్తిన ఖయ్యూం మృతి చెందడంతో పెద్ద ఎత్తున ప్రజలు జెండాకట్ట వద్దకు చేరుకున్నారు. పీర్లను ఊరేగించకుండా వెనక్కి తీసుకు వచ్చి చావిడిలో కొలువుదీర్చారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఇతర బృందం నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో ఓ మహిళ(40) గంజాయిని ఇతరులకు విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. నిందితురాలి నుంచి 435 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆమెను రిమాండ్‌కు పంపుతున్నట్టు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుత్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు ఆదివారం జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడి ఎడమ చేతిపై స్వప్న అని టాటూ మార్క్ ఉందని వివరించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు అపహరణ

చిలమత్తూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పొలంలో పశుగ్రాసం కోస్తున్న మహిళ కళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు కారం కొట్టి బంగారు గొలుసు అపహరించుకు వెళ్లిన ఘటన మండలంలోని మొరసలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. మొరసలపల్లికి చెందిన శాంతమ్మ గ్రామ సమీపంలోని తన పొలంలో పశువుల మేత కోసం వెళ్లింది. అక్కడ పశుగ్రాసం కోస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కళ్లల్లో కారం కొట్టి మెడలో ఉన్న మూడు తులాల బంగారు మాంగళ్యం గొలుసుని లాక్కెళ్లారు. కళ్లల్లో పడిన కారం మంటతో ఆమె గట్టిగా అరుచుకుంటూ ఊళ్లోకి వచ్చి జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది. కళ్ల మంటతో బాధపడుతున్న ఆమెను 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

మడకశిర టౌన్/రూరల్, జూలై6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మణూరు గ్రామంలో గతనెల 28న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముత్తక్క అనే వృద్ధురాలి హత్య కేసులో వారం రోజుల్లోనే నిందితులను అరెస్టు చేశామని వివరించారు. ముత్తక్కను జూన్ 28వ తేదీ రాత్రి మణూరు గ్రామంలో ఇంట్లో నిద్రపోతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన మాళమ్మగారి చౌడప్ప, బిహార్ రాష్ట్రానికి చెందిన.. మణూరులో నివాసం ఉన్న ఊర్మిళాదేవి ఇద్దరు కలిసి హత్య చేసినట్లు తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన జితేంద్రపాశ్వాన్ మణూరుకు వచ్చి సమీపంలోని ఒక కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడని వివరించారు. అతడి భార్య ఊర్మిళాదేవితో చౌడప్ప వివాహేతర సంబంధం పెట్టుకొన్నాడని తెలిపారు. ముత్తక్క ఒంటరిగా ఉండడంతో ఆమె వద్ద ఉన్న బంగారం, నగదు తీసుకోవాలని పన్నాగం పన్నారని అన్నారు. ఆమె రాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో మంచం పైనుంచి కిందకు లాగి ఊర్మిళాదేవి ముత్తక్క కాలు గట్టిగా పట్టుకోగా.. చౌడప్ప ముత్తక్క నోటిపై తల దిండుతో బలంగా పట్టుకొని అక్కడ ఉన్న ఇనుప రాడుతో గొంతుపై పెట్టి గట్టిగా నొక్కి చంపినట్లు వివరించారు. ముత్తక్క వద్ద ఉన్న బంగారు చైన్, కాలి వెండి పట్టీలు, బీరువాలోని రూ.25వేల నగదును ఎత్తుకు వెళ్లినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బదిలీ చేసేరా..?

ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు

సొంత మండలానికి దూరంగా విధులు

బదిలీల కోసం నిరీక్షణ.. పట్టించుకోని యంత్రాంగం


రైతు సేవాకేంద్రం

అనంతపురం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలోని ఎంపీఈఓ (మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)ల బదిలీలపై సందిగ్ధత నెలకొంది. రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు పూర్తయినా.. ఎంపీఈఓల బదిలీలపై సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుసేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీల్లో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ప్రాధాన్యమివ్వడం లేదన్న ఆవేదనను బాధిత ఎంపీఈఓలు వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన కొందరు ఎంపీఈఓలు అనంత జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనంత జిల్లాతోపాటు సత్యసాయి జిల్లాలో సొంత మండలానికి దూరంగా ఎంపీఈఓలు పనిచేస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలున్న మహిళా ఎంపీఈఓలు మరింత ఇక్కట్లకు గురవుతున్నారు.

సర్దుబాటుపై నిర్లక్ష్యం

క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాలకు రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓల స్థానాలను కేటాయించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు పూర్తి కావడంతో కొత్త స్థానాల్లో చేరిపోయారు. ఎంపీఈఓలకు బదిలీల ప్రక్రియ చేపట్టకపోవడంతో వారి స్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఆయా ఆర్‌ఎస్‌కే స్థానాలతోపాటు పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మిగిలిన ఎంపీఈఓలను సర్దుబాటు చేయడంపైనా సంబంధిత ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 126 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 180 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 12 కేంద్రాలకు సిరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 133 కేంద్రాలు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు విధులు నిర్వర్తించేలా నిర్ణయించారు. అనంత జిల్లాలో 189 మంది ఎంపీఈఓలు పనిచేస్తుండగా.. 133 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 56 మందిని పంటల విస్తీర్ణం ఎక్కువ కలిగిన ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 420 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 124 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 143 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 73 కేంద్రాలకు సిరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 80 కేంద్రాలకు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను కేటాయించారు. సత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు ఉండగా.. 80 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 54 మందిని పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. ఎంపీఈఓలను సర్దుబాటు చేయడంలో సంబంధిత అధికారులు జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బదిలీల కోసం నిరీక్షణ

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఆప్షన్లు తీసుకొని, వారికి అనుకూలమైన స్థానాలకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది చేసే పనులే చేస్తున్న ఎంపీఈఓలు తమకు అనుకూలమైన స్థానాలకు బదిలీ చేస్తారన్న ఆశతో నిరీక్షిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని ఎంపీఈఓలకు మూడు ఆప్షన్లు తీసుకొని బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తెలిసింది. కడప జిల్లాలో ఎంపీఈఓలు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారన్న సమాచారం సేకరించి, బదిలీలు చేసేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. ఉమ్మడి అనంత జిల్లాలో ఎంపీఈఓల బదిలీల ఊసెత్తకపోవడం గమనార్హం.

సొంత జిల్లాకు వచ్చినా తీరని సమస్యలు

2015 సంవత్సరంలో టీడీపీ హయాంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరఫున సిబ్బందిని నియమించింది. వ్యవసాయ శాఖలో వీఏఏలు, ఆర్బీకే సిబ్బంది నియామకాలతో అప్పటి దాకా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు గడ్డుకాలం ఏర్పడింది. 2020 సంవత్సరంలో అనంత ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 650 మందిలో 260 మందిని చిత్తూరు జిల్లాకు ఓడీపై బదిలీ చేశారు. ఎంపీఈఓల సంఘం నాయకులు, టీడీపీ ప్రజాప్రతినిధుల చొరవతో ఎంపీఈఓలను ఎట్టకేలకు గత ఏడాది నవంబరు మాసంలో ఉమ్మడి జిల్లాకు రప్పించారు. అప్పట్లో తమను సొంత జిల్లాకు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను కోరినా తర్వాత చూద్దామని పక్కనపెట్టారు. సొంత మండలానికి సుదూరంగా పనిచేయాల్సి వస్తోంది. ఆర్‌ఎస్‌కే సిబ్బంది తరహాలోనే తమకు అనుకూలమైన స్థానాలు కేటాయిస్తారని ఆశలు పెట్టుకున్న ఎంపీఈఓలకు న్యాయం జరుగుతుందో..? లేదో వేచిచూడాల్సిందే.

కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు రాలేదు



రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలను పూర్తి చేశాం. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలను బదిలీ చేయాలని కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు రాలేదు. క్రమబద్ధీకరణలో భాగంగా జిల్లాలో పంట విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని ఆర్‌ఎస్‌కేలలో ఏఏ శాఖల సిబ్బంది పనిచేయాలో ఖరారుచేశాం. కొన్ని ఆర్‌ఎస్‌కేల్లో వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను కేటాయించాం. ఎక్కువ విస్తీర్ణం కలిగిన ప్రాంతాల్లో మిగిలిన ఎంపీఈఓలను సర్దుబాటు చేస్తాం.

-ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

ఇంటి పట్టా.. అనర్హుల పుట్ట!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు వసూలు చేసిన ఓ రెవెన్యూ అధికారి బెంగుళూరులో రూ.కోట్లు ఖర్చుపెట్టి ఓ భారీ భవంతిని నిర్మించుకున్నట్లు తెలిసింది.

సీఎంకు ఫిర్యాదు చేసే యోచన

వైసీపీ హయాంలో బ్రాహ్మణపల్లి లేఅవుట్ అక్రమాలపై రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ లేఅవుట్ అక్రమాలపై కొంతమంది గ్రామస్థులు, టీడీపీ నాయకులు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీపీఆర్సీ సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి కూడా లేఅవుట్‌లో అక్రమ పట్టాల విషయంపై విచారించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి మూడుమార్లు లేఅవుట్‌ను పరిశీలించి, ఖాళీ భూమిలో మాత్రమే 151 మంది అక్రమ పట్టాలు పొందినట్లు గుర్తించారు. నివేదికలు తయారుచేసి ఆరు నెలలు పూర్తయినా అక్రమార్కులపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడానికి అధికారులు జంకుతున్నారు. ఈ అక్రమ పట్టాల విషయంలో అధికార పార్టీకి చెందిన ఓ రాజకీయ దళారీ, మధ్యవర్తిగా వ్యవహరించి, అక్రమార్కులను కాపాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. 1,895 మంది పట్టాలు పొందిన వారిలో సగానికి పైగా అనర్హులు ఉండగా.. వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోకుండా కేవలం ఖాళీ భూమిలో పట్టాలు పొందిన కొంతమందిపై చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 10న పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తుండడంతో ఆయనను కలిసి, అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి కూటమి నాయకులు సిద్ధమయ్యారు.

50 పట్టాలు రద్దు చేశాం: సువర్ణ, ఆర్డీవో, పుట్టపర్తి

పుట్టపర్తి మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి జగనన్న లేఅవుట్‌లో బోగస్ పట్టాలపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టాం. లేఅవుట్ మధ్యలోని ఖాళీ భూమిలో పట్టాలు పొందిన 50 మందిని అనర్హులుగా గుర్తించి, పట్టాలు రద్దుచేశాం. మరికొన్నింటిపై విచారిస్తున్నాం.

సీమ వచన శతక తొలికవి షరీఫ్

- 'చెట్టు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఆధునిక సాహిత్యంలో వచన శతకం రాసిన తొలికవి డాక్టర్ జూటూరు షరీఫ్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన రచించిన వచన శతకం 'చెట్టు' పుస్తకావిష్కరణ సభను అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. అరసం జిల్లా గౌరవాధ్యక్షుడు ఉప్పరపాటి వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు రచయిత డాక్టర్ శాంతినారాయణ, అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ... వచన శతకం రాసినవారిలో జూటూరు షరీఫ్ రాయలసీమలో మొదటివాడని పేర్కొన్నారు. పర్యావరణ విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కావ్యమని, దీని ద్వారా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని నింపారని పేర్కొన్నారు. చెట్టును కేంద్రంగా చేసుకుని ప్రభావశీలంగా, కవితాత్మకంగా వచన శతకం రాయడం అభినందనీయం అన్నారు. అనంతరం సాహితీవేత్తలు షరీఫ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యులు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ అంకె శ్రీనివాస్, మురళీకృష్ణ భరద్వాజ్, రాయుడు, శ్రీనివాసరెడ్డి, శ్యామసుందరశాస్త్రి, సూర్యనారాయణరెడ్డి, తన్నీరు నాగేంద్ర, రాంకుమార్, గోవిందరాజులు, కొత్తపల్లి సురేష్, జెన్నె ఆనందకుమార్, కృష్ణమూర్తి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, చెట్ల ఈరన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాహన దొంగలు వైసీపీ మద్దతుదారులే..

జావిద్‌ఖాద్రీ, తైక్వాండో బాబాను విచారించాలి

తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ షెక్షావలి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్

తాడిపత్రి, జూలై6(ఆంధ్రజ్యోతి): వాహన చోరీలు చేసింది వైసీపీ మద్దతుదారులే అని మున్సిపల్ వైస్‌చైర్మన్ షెక్షావలి ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండురోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ.. వాహనాలను అపహరిస్తున్నది మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులేనని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెద్దారెడ్డి అనుచరులు గయాజ్, ముస్తాక్‌ఖాదీ, రోషన్ చోరీలకు పాల్పడ్డారన్నారు. వీరంతా వైసీపీ పట్టణ అధ్యక్షుడు జావీద్‌ఖాద్రీ సమీప బంధువులే అన్నారు. ఈ విషయాలను కప్పిపుచ్చుతూ పెద్దారెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వీరంతా పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులే అనీ, ఆయనకు ఏమైనా వాటాలు ఇచ్చారా అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే తైక్వాండో బాబా దగ్గర రెండు స్కూటీలున్నాయనీ, వాటిని ఎందుకు రికవరీ చేయలేదన్నారు. పదేపదే ముస్లిం యువకుల గురించి మాట్లాడుతూ వారిని దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరోసారి ముస్లిం యువకుల గురించి మాట్లాడితే నాలుక కోస్తామని పెద్దారెడ్డిని హెచ్చరించారు. ముఖ్యమైన జావిద్‌ఖాద్రీ తైక్వాండో బాబాను విచారించకపోతే ఈనెల 9న డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్‌బాషా, ఖాదర్, టాటా హాజీ, ఫరూక్, నజీర్, హాజీ, గాంధీ, అయూబ్ పాల్గొన్నారు.

భార్య, పిల్లలు కనిపించట్లేదని ఫిర్యాదు


ఎర్రమ్మ, పిల్లలు (ఫైల్)

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఎర్రమ్మ, కుమారుడు నందకిశోర్, కుమార్తె వసంతిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త రామకృష్ణ ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఎర్రమ్మ భర్తతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ తెలిసిన వారు 6305800429, 9849665132, 9391560956 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

గూగూడు బ్రహ్మోత్సవాలకు 65 బస్సులు : ఆర్ఎం

అనంతపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అనంతపురంతోపాటు తాడిపత్రి, ధర్మవరం డిపోల నుంచి నార్పల మీదుగా గూగూడుకు 65 బస్సులు నడిపినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం గూగూడులో ప్రత్యేక బస్సు కౌంటర్‌ను సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. సోమవారం కూడా అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాల సందర్భంగా 75 బస్సులను నడుపుతామని వివరించారు.

కేజీబీవీ ఘటనపై జేసీ విచారణ

బాధ్యులపై చర్యలు చేపట్టండి: సీపీఎం


జేసీకి సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఉన్న కేజీబీవీని ఆదివారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సందర్శించారు. మూడు రోజుల క్రితం విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన విదితమే. ఈ నేపథ్యంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ ఆనంద్ కుమార్‌తో కలిసి కేజీబీవీని సందర్శించారు. సంఘటన పూర్వాపరాలపై విచారణ చేపట్టారు. హాస్టల్ గదులు, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. స్థానిక సిబ్బంది, విద్యార్థినులను విచారించారు. అనంతరం అక్కడికి చేరుకున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు జేసీని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కేజీబీవీలో టీచింగ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మధ్య సమన్వయం లోపించడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తాగునీరు, ఆహారంలో నాణ్యత లోపించడంవల్ల గత మూడేళ్లుగా ఇలాంటి సంఘటనలు అనేకమార్లు చోటుచేసుకున్నాయన్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైతే తల్లిదండ్రులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వివరించారు. గుట్టుచప్పుడు కాకుండా చికిత్సలు ఎందుకు చేయిస్తున్నారో తెలియడం లేదన్నారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన జేసీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కొండావెంకటేశులు, నాగభూషణ, రవి, మాబు, రామక్రిష్ణ, గోవిందప్ప, జింకా నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు

మూడోరౌండ్ మల్టీడే క్రికెట్ పోటీలు ప్రారంభం


అభిషేక్‌రెడ్డి


పృథ్వీరాజ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో భారీ స్కోరుపై చిత్తూరు జట్టు కన్నేసింది. సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ మూడో రౌండ్ పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో ప్రారంభమయ్యాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 81 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 316 పరుగులు చేసింది. బ్యాటర్లు అభిషేక్ రెడ్డి (160), పృథ్వీరాజ్ (125 నాటౌట్) సెంచరీలతో చెలరేగారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 65.5ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. నారాయణ (52), సుబ్రహ్మణ్య (51) హాఫ్ సెంచరీలతో అలరించారు. కడప బౌలర్లు పఠాన్ షరీఫ్ 5, ఆరీఫ్ బాషా 3వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప 12.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది.

కడప జట్టుపై అనంత గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కడప జట్టుపై జిల్లా అండర్-19 పురుషుల జట్టు విజయం సాధించింది. కడపలో నిర్వహిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 సౌత్‌జోన్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు 59.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 92.2 ఓవర్లలో 8 వికెట్లకు 486 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంత బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి డబుల్ సెంచరీతో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 51.1 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. దీంతో అనంత జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో భారీ విజయం సొంతం చేసుకుంది. వరుణ్‌సాయి నాయుడు ఐదు వికెట్లు పడగొట్టాడు.

పశువుల సంత ఆదాయం రూ.2.87 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.2,87,530 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,77,830, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,09,700 వచ్చిందని తెలిపారు.

జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా బేస్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈనెల 12వతేదీ నుంచి కదిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబుళేసు, ప్రధాన కార్యదర్శి నవీన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సంతోష్‌నాయక్, లెక్చరర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పాతూరు వీధుల్లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లావ్యాప్తంగా హిందూ, ముస్లింలు వేడుకను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరికొందరు ఉపవాస దీక్ష చేసి, సాయంత్రం నమాజ్ అనంతరం దీక్షను విరమించారు. ప్రధానంగా పాతూరు వీధుల్లో పీర్లతో సందడి వాతావరణం నెలకొంది. యువత డ్రమ్స్ వాయిద్యాలతో కేరింతల నడుమ నృత్యాలు చేశారు. పలువురు భక్తులు పానకాలు చేసి పంచారు. అలాగే బళ్లారి బైపాస్ - తపోవనం సర్వీస్‌రోడ్డులో జమాతే అషికానే ముస్తఫా సంస్థ ఆధ్వర్యంలో వాహన చోదకులు, బాటసారులకు షరబత్ పంపిణీ చేశారు. పాతూరుతోపాటు చాలా కాలనీల్లో పీర్ల ఊరేగింపులు కనులపండువగా సాగాయి.

రాప్తాడు: మండలంలోని బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి, బోగినేపల్లి గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్ల చావిడిలో పీర్లను కొలువుతీర్చి చక్కెర చదివింపులు చేశారు. గొందిరెడ్డిపల్లిలో ఆదివారం పెద్ద సరిగెత్తు నిర్వహించారు. బండమీదపల్లి బోగినేపల్లిలో చిన్నసరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాలను పురష్కరించుకుని కూరగాయాల ఓబుళపతి, లక్ష్మీదేవి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కురుబసంఘం అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు ప్రారంభించారు. మొహర్రం ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు.

శింగనమల: నియోజకవర్గ కేంద్రంలో మొహర్రరం విడిది దినం సందర్భంగా పీర్ల వద్ద ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం రాత్రి మకానంలోని పీర్లకు బండారు లీలావతి, కిన్నెరశ్రీ, పూలహారాలు చక్కెర చదివింపులు చేశారు.

బుక్కరాయసముద్రం: హిందూముస్లింలు కలిసి చేసుకునే మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా బుక్కరాయసముద్రంలోని హజరత్ సయ్యద్ హుసేన్, ఇమామ్ ఖాసీం, ఇమామ్ హుసేన్, రెడ్డిపీర, తరిమెల పీర్లు మకానంలో కొలువుతీర్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లన్నగారి శ్రీనివాసులు అధ్వర్యంలో వేడుకలకు సిద్ధం చేశారు. సోమవారం వేకుజామున అగ్నిగుండ ప్రవేశం అనంతరం సాయంత్రం ఊరేగింపు, జలధి ఉంటుంది.



బుక్కరాయసముద్రంలో గుండాన్ని కాలుస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

శ్రీవారి సన్నిధిలో పరిటాల కుటుంబం



తిరుమలలో పరిటాల సునీత, కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం,జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవారిని సదర్శించుకున్నారు. తిరుమల పర్యటనలో ఉన్న సునీత, పరిటాల శ్రీరాం, రెండో కుమారుడు పరిటాల సిద్ధార్థ, ఇతర కుటుంబసభ్యులతో ఆదివారం మొదట కాణిపాకం గణపతిని దర్శించుకున్నారు. తర్వాత తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సునీత అన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం

అనంతపురం విద్య, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, నగర అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఉద్యమాల కరపత్రాలను విడుదల చేసారు. వారు మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపడుతున్నాయన్నారు. ఎన్డీఏ సర్కారు కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. పలు డిమాండ్లతో సార్వత్రిక సమ్మెకు కార్మికులు దిగుతున్నారని, దీనికి ముందుగా 7న బైక్ ర్యాలీ, 8న ఆటో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణుడు, రాజు, కృష్ణానాయక్, అక్బర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు మాక్ టెస్ట్

అనంతపురం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ న్యాయాధికారుల పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న జూనియర్ న్యాయవాదులకు ఆల్ ఇండియా లాయ్స్ అసోసియేషన్ (ఏఐఎల్‌యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ నిర్వహించారు. ఆదివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో గౌరవాధ్యక్షుడు సీతారాం అధ్యక్షతన మాక్ టెస్ట్ నిర్వహించారు. అధ్యక్షులు గురుప్రసాద్, జనరల్ సెక్రెటరీ వెంకటరాముడు, ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, ట్రెజరర్ రఘు, న్యాయవాది హరినాథరెడ్డి నమూనా ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించారు. ఏఐఎల్‌యూ జిల్లా అధ్యక్షుడు వీరమానప్ప, కార్యదర్శి సతీష్, సూర్యచంద్ర, ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం, గిరి, భాను పాల్గొన్నారు.

బోగస్ విద్యార్థి సంఘాల వేధింపులు ఆపండి

అనంతపురం విద్య, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బోగస్ విద్యార్థి సంఘాలు వివిధ కారణాలు చూపుతూ ప్రైవేట్‌స్కూల్స్ యాజమాన్యాలను వేధింపులకు గురిచేస్తున్నాయని కలెక్టర్‌కు అప్సా నాయకులు కుసుమా పుల్లారెడ్డి, రవిశంకరప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన మెగాపేరెంట్స్ మీటింగ్ సమావేశానికి హాజరైన సమయంలో చివరలో రాష్ట్రకార్యదర్శి పుల్లారెడ్డి, జిల్లాఅధ్యక్షుడు రవిశంకరప్రసాద్ జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్‌ను కలిశారు. ప్రభుత్వ నిర్ణయాలను తప్పకుండా పాటించి అమలు చేస్తామన్నారు. కొందరు బోగస్ విద్యార్థి సంఘాల పేరుతో నిత్యం పాఠశాలలపై పడి వేధిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యా, పోలీస్ శాఖలను ఆదేశిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

దేశ సేవలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పాత్ర అమోఘం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశానికి, ప్రజలకు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు అమోఘమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అన్నారు. ఆయన 124వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజేష్ మాట్లాడుతూ.. కశ్మీర్ అంశంలో ఆర్టికల్ 370, ఒకేదేశం-ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని ఉండాలని అప్పటి ప్రభుత్వంపై ముఖర్జీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ముఖర్జీ చేసిన తాగాలను, ఆశయాలకు అనుగుణంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఓలేటి రత్నమయ్య, అశోక్‌రెడ్డి, చక్రధర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

అనంతపురంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శివశంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పరపల్లిలో సర్పంచు సావిత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీఈఓతోపాటు ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు హాజరయ్యారు

గుండె వైద్యశిబిరానికి స్పందన

రామగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. అనంతపురంలోని మార్క్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్, పరిటాల సిద్ధార్థల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కుంటిమద్దిరంగయ్య, రామ్మోహన్‌చౌదరి, పెద్దిరెడ్డి చంద్రశేఖర్, ప్రభాకర్‌చౌదరి, శ్రీధర్‌నాయుడు, మారుతీప్రసాద్, మురళి, తిమ్మానాయుడు, శ్రీనివాసులు, దాదు, నారాయణచౌదరి పాల్గొన్నారు.

రిటైర్డ్ తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓతదితరులు

శెట్టూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనతో పాటు ఆయన భార్య భాగ్యలక్ష్మిని స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, విశ్రాంత డీఎస్ఓ శివశంకర్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధికారి దివాకర్, కంబదూరు తహసీల్దారు బాలకిషన్, పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

నల్లాని రాజేశ్వరికి అవార్డు



చెన్నైలో అవార్డు అందుకుంటున్న నల్లాని రాజేశ్వరి

అనంతపురం విద్య, జూలై 6(ఆంధ్రజ్యోతి): సామాజికవేత్త నల్లాని రాజేశ్వరి సేవలకు మరోసారి గుర్తింపు దక్కింది. విద్య, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాలలో అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ తమిళనాడు రాష్ట్ర, ట్వెల్‌మేగజైన్, గ్లోబల్‌పింక్ ఆర్మీ సంయుక్తంగా దక్షిణభారత మహిళా విజేత-2025 పురస్కారానికి ఆమెను ఎంపిక చేశారు. అవార్డును ఆదివారం చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ ఆడిటోరియంలో విద్యావేత్త షెర్లీ జేసురాజ్ చేతులమీదుగా ఆమె అందుకున్నారు.

త్యాగరాజ సభ పూర్వవైభవానికి కృషి చేస్తాం: ఎంపీ



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని త్యాగరాజ సభకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ద్వారకానగర్‌లోని త్యాగరాజ సంగీతసభ 67వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, సంగీతసభ నూతన అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత మంగళంపల్లి బాలమురళీకృష్ణ, మైసూర్ వరదరాజ అయ్యంగార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ సనాతన ధర్మంలో సంగీతానికి, శాస్త్రీయ నృత్యాలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. త్యాగరాజ సంగీతసభ వేదికగా ఎందరో ప్రముఖులు కచేరీలు ఇచ్చి జిల్లా కీర్తిని నలుదిశల వ్యాపింపజేశారన్నారు. ప్రతి ఆదివారం పాటల పోటీలు నిర్వహించి ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం దేవరకొండ కౌసల్య బృందం కోలాటం, పట్నం శివప్రసాద్ శిష్యబృందం సంప్రదాయ నృత్యాలతో అలరించారు. తదనంతరం ఎంపీ సమక్షంలో కళాకారులచే కేక్ కట్‌చేయించి తినిపించి సంబరాలు చేసుకున్నారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న, త్యాగరాజ సంగీతసభ కార్యదర్శి ప్రభావతి, సహాయ కార్యదర్శి లతాశ్యామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నేకొత్తపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్ఎస్‌గేటు, వెంకటంపల్లి, మేడాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పేదలను హరిస్తున్న అధిక వడ్డీలు

అనంతపురం వైద్యం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేదల అవసరాలను ఆసరాగాచేసుకుని వడ్డీవ్యాపార్థులు అధిక వడ్డీలు వసూలుచేస్తూ వారి ప్రాణాలను హరిస్తున్నారని అధిక వడ్డీల వ్యతిరేకపోరాట కమిటీ అధ్యక్షుడు సాకేహరి ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల అతిథిగృహంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డీ వ్యాపారం దిన, వారం, నెల పద్ధతుల్లో సాగుతోందన్నారు. ఉద్యోగులతో ఖాళీచెక్కులు, ప్రామిసరీ నోట్లు రాయించుకోవడం, ఏటీఎంలు లాక్కుంటున్నారన్నారు. ఈ విషయంపై న్యాయస్థానాలు, పోలీస్‌శాఖ పట్టించుకోవపోవడంతో వారి అక్రమాలు యథావిధిగా సాగుతున్నాయన్నారు. అనంతరం నూతన కమిటీగా సాకేహరితోపాటు కుళ్లాయప్ప, ఆదినారాయణ, సదాశివారెడ్డి, జేఎం బాషా, శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, రఫిక్ అహ్మద్, రామరాజు, మహమ్మద్ రఫీక్, సూర్యానారాయణ, యేసుపాదంలను ఎన్నుకున్నారు.

నీట్‌లో మెరిసిన అభినవ్‌కు సన్మానం



నీట్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న గాండ్ల సంక్షేమసంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): నీట్ ఎరీక్షలో జాతీయస్థాయిలో 231వ ర్యాంకు సాధించిన మేడాపురం గ్రామానికి చెందిన ప్రభాకర్, సుజాత దంపతుల కుమారుడు జోగన్నగారి అభినవ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. అఖిల గాండ్ల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గంగప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అభినవ్‌ను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థి అభినవ్‌ను అభినందించారు. టీచర్ కృష్ణమూర్తి, గాండ్లసంఘంనాయకులు రామయ్య, లలితాంబ, లక్ష్మీనారాయణ, రవికుమార్, గంగాదర్, కేపీకుమార్, రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ



క్రీడాకారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసిన డీఎస్‌డీఓ, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియం, ఎస్ఎస్‌బీఎన్, నీలం సంజీవరెడ్డి పీటీసీలలో నిర్వహించిన వేసవి ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం ఇండోర్‌స్టేడియంలో డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి, సహాయ కార్యదర్శి బలరామారావు, సభ్యులు నరసారెడ్డి, నరేష్‌రెడ్డి, మనోజ్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌కు ఏకలవ్య పేరు పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు ఏకలవ్యగా నామకరణం చేయాలని పలువురు ఎరుకల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక 28వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఇన్‌చార్జి వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ సాధన, ఏకాగ్రతలతో లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించిన ఏకలవ్యుడు ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నగరంలో కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఏకలవ్య పేరుపెట్టాలన్నారు. వెంకటరామయ్య, రామాంజనేయులు, మనోహర్, చిరంజీవి, గోవింద్, శ్రీరాములు పాల్గొన్నారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరం



కుక్కకు రేబిస్ నివారణ టీకా వేస్తున్న జేడీ సుధాకర్

అనంతపురం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరమని పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ అన్నారు. ఆదివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో జూనోసిస్ డేను నిర్వహించారు. ఏడీ సురేష్‌తో కలిసి జేడీ పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది వెటర్నరీ ఆస్పత్రుల్లో కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కలు, వీధికుక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు, వెటర్నరీ డాక్టర్లు శ్రుతి మహేష్, దిలీప్, సుచరిత, సునీత పాల్గొన్నారు.

రాప్తాడు : కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని రాప్తాడు పశువైద్య సహాయ సంచాలకులు ప్రకాష్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో 35 కుక్కలకు టీకాలు వేశారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం: ద్విసభ్య కమిటీ సభ్యులు

బుక్కరాయసముద్రం, జూలై 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని టూమెన్ కమిటీ సభ్యులు ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక దేవరకొండ వద్ద ఉన్న గాయత్రి కల్యాణమండపం వద్ద నూతన మండల కన్వీనర్ ఎంపిక, టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టూమెన్ కమిటీ సభ్యులతోపాటు పరిశీలకులు మల్లిఖార్జున, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, పసుపుల శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. నూతన మండల కన్వీనర్ ఎంపికలో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. మండల కన్వీనర్ కోసం బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఆర్ నారాయణస్వామి, చెన్నంపల్లి గ్రామానికి చెందిన మల్లిఖార్జునరెడ్డి, రేగడికొత్తూరు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య పార్టీ పరిశీలకులు పేర్లు ఇచ్చారు. ద్విసభ్యకమిటీ సభ్యులు రామలింగారెడ్డి, శ్రీరామిరెడ్డిలలో ఒకరిని ఎంపిక చేయాలని సూచించారు. మల్లిఖార్జునరెడ్డి, నారాయణస్వామిలకు నచ్చజెప్పి ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేయడంతో స్వచ్ఛందంగా పోటీనుంచి వారు తప్పుకున్నారు. దీంతో ఈశ్వరయ్యకు ప్రధాన కార్యదర్శి, లక్ష్మీనారాయణకు కన్వీనర్ పదవి ఇచ్చేందుకు నేతలు ప్రయత్నించారు. ఈశ్వరయ్య సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు. సమావేశానికి వచ్చినవారిలో 95 శాతం పైగా కార్యకర్తలు, నేతలు లక్ష్మీనారాయణకే పదవి ఇవ్వాలని పార్టీ పరిశీలకులు తెలిపారు. అలా ఎంపిక చేయలేమని, పార్టీ అధిష్టానానికి ఇద్దరు పేర్లను పంపుతానని తెలిపారు. లక్ష్మీనారాయణ పేరును ఏకగ్రీవంగా ఖరారు చేయాలని పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ పరిశీలకుడిని డిమాండ్ చేస్తూ వాహనాన్ని అడ్డుకున్నారు. టూమెన్ కమిటీ సభ్యులు జోక్యం చేసుకుని కార్యకర్తలకు నచ్చచెప్పారు.

వైసీపీ వారికే అధికారుల వత్తాసు

మండలంలో ఏ అధికారి తమ మాట వినడం లేదని పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ పరిశీలుకులు, ద్విసభ్యకమిటీ సభ్యులు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కార్యాలయానికి వెళ్లినా అంతా వైసీపీ వారికే వత్తాసు పలుకుతున్నారన్నారు. చెదల్ల గ్రామంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు వైసీపీవారికే పనులు చేస్తున్నారని నారాయణస్వామి, మల్లిఖార్జునరెడ్డి వాపోయారు. మండల కన్వీనర్ అశోక్, రవీంద్ర, లక్ష్మీనారాయణ, పెద్దప్ప, ఎస్‌నారాయణస్వామి, కేశన్న, ఎస్‌కే వెంకటేశులు, సాకే రామక్రిష్ణ, రామానాయుడు, మల్లేశు, రాము, జొన్నరామయ్య, ఓబులపతి, సోము, నరేంద్రయాదవ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన టూమెన్ కమిటీ సభ్యులు ఆలం, ముంటిమడుగు, రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నాయకులు

తెరుచుకున్న పీర్ల చావిడి..!

● ఇరువర్గాల గొడవతో మూత ● పెద్దల సమక్షంలో రాజీ



దర్గాలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

శింగనమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య తలెత్తిన గొడవతో స్థానిక కొడిపీర్ల చావిడికి తాళం వేశారు. గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో పీర్ల చావిడికి తాళం తెరిచారు. సోమవారం కొడి పీర్లను ఎత్తుతుండటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పీర్లను ఎత్తే విషయంలో రెండు వర్గాల విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం దర్గాలో కొడి పీర్లు ఎత్తే విషయంలో ముస్లిం, బలిజ, కాపు(రెడ్డి) నాయీబ్రాహ్మణ కుటుంబాలతో గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ అన్ని పీర్ల మకానాల్లో పీర్లను ఎత్తుతుంటే ఇక్కడ పీర్లు ఎత్తే విషయంలో మీ మధ్య విభేదాలు తలెత్తాయన్నారు. పీర్లను ఎత్తకపోతే గ్రామానికి అరిష్టం జరుగుతుందని, విభేదాలు పక్కన పెట్టి పీర్లను ఎత్తాలని వారికి గ్రామపెద్దలు సూచించారు. చివరకు ముస్లిం కుటుంబాలు పీర్లను ఎత్తడానికి గ్రామపెద్దలు నిర్ణయించడంతో సమస్య పరిష్కారమైంది.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

రామగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ప్రజలకు సూచించారు. ఆదివారం సాయంత్రం ఆయన పోలీసులతో కలిసి మాదాపురం, ఆర్‌కొత్తపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

విగ్రహంపై దాడి దుర్మార్గం

అనంతపురం వైద్యం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో బుద్ధవిగ్రహంపై దాడి దుర్మార్గమైన చర్య అని బౌద్ధ సంఘాల జేఏసీ నాయకుడు హరిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. బుద్ధపార్క్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడిఘటనపై సమగ్రదర్యాప్తు చేపట్టాలని బౌద్ధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. దాడిచేసినవారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులను జరుగకుంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగం రాలేదని యువకుడు..



పురుషోత్తం(ఫైల్)

శింగనమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శింగనమల మండలం పెరవలి గ్రామంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పెరవలి గ్రామానికి చెందిన కొంకా లక్ష్మీనారాయణ, నాగేంద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు కొంకా పురుషోత్తం (23) అనే యువకుడు ఆదివారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పురుషోత్తం చదువులో దిట్ట. కుటుంబ సభ్యులు వ్యసాయ పనులు చేసుకుంటూ పురుషోత్తంను డిగ్రీ వరకు చదివించారు. రెండు సంవత్సరాల క్రితమే డిగ్రీ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా చిన్న ప్రైవేటు ఉద్యోగం కూడా రాకపోవడంతో 20 రోజులుగా మనస్థాపంతో ఉన్నాడు. ఉద్యోగం రాలేదని స్నేహితులతో కూడా బాధపడేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శింగనమల ఏఎస్ఐ చితంబరయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 'నేను బతికున్నంత వరకు కూలీ పనులు చేసి అయినా నిన్ను సాకే దాన్ని కదా నాయనా..' అంటూ పురుషోత్తం మత్యదేహంపై పడి తల్లి వేదనను చూసి గ్రామస్థులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పెయింటర్ అనుమానాస్పద మృతి



చంద్రశేఖర్(ఫైల్)

అనంతపురం క్రైం,జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవింద్ నగర్‌లో పెయింటర్ చంద్రశేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన మేరకు చంద్రశేఖర్(45) నగరంలోని మారుతీనగర్‌లో నివాసం ఉండేవాడు. ఆయన భార్య శాంతబాయి, కొడుకు జగదీష్(19), కుమార్తె మానస ఉన్నారు. ఐదేళ్ల కిందట భార్య ఆయన నుంచి విడిపోయి పిల్లలతో కలసి కళ్యాణదుర్గంలో ఉంటోంది. చంద్రశేఖర్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెయింటర్ పనిచేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం తాగుతూ తనకు తోచిన చోట నిద్రపోతూ గడిపేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి అరవింద్‌నగర్‌లోని పార్కులో సచివాలయంపైన మద్యం మత్తులో పడుకున్నారు. పై నుంచీ దిగేటప్పుడు పడ్డాడో లేక, ఇతర కారణాలతో ఆయన మరణించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు, జూలై6(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరం హమాలీ కాలనీకి చెందిన వెన్నపూస విజయ్‌శేఖర్‌రెడ్డి (39) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన మేరకు వెన్నపూస విజయ్‌శేఖర్‌రెడ్డి 2015లో ఇంటిపై నుంచి పడి వెన్నెముక దెబ్బతినగా కుటుంబ సభ్యులు బెంగళూరులో చికిత్స చేయించినా నయం కాలేదు. 2018, 2019లో ఆత్మహత్యకు యత్నించిన గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. 4వ తేదీన విజయ్‌శేఖర్‌రెడ్డి మూడు చక్రాల ఎలక్ట్రికల్ ఆటోలో ఇంటి నుండి వెళ్లాడు. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్దవెతికినా ఆచూకీ తెలియలేదు. ప్రసన్నాయపల్లి పంచాయతీ ఆఫీసు పక్కన ప్లాట్ల ప్రీకాస్ట్ లే అవుట్‌లో ఆటోలో వెనుక వైపు చనిపోయినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు ఉరవకొండకు మంత్రి రాక

ఉరవకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం పర్యటించనున్నారు. రూ.16 కోట్లతో జలజీవన్ మిషన్ నిధులతో ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకూ రూ.17 కి.మీ మేరకు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో సోమవారం ఈ పథకాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తారు. కణేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకూ రోడ్డు నిర్మాణానికి, పాల్తూరు రోడ్డు, రాయపల్లి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీ మహేష్ కోరారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఆదివారం కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన సదస్సు

రాయదుర్గంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జూనోసిస్ వ్యాధులపై స్థానిక పశువైద్యశాలలో పశువుల వైద్యుడు సూర్యనారాయణరెడ్డి ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రేబీస్ వ్యాధి నివారణ టీకాలను కుక్కలకు వేయించుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

తాడిపత్రి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం కాంట్రాక్ట్‌తో మాట్లాడుతూ... ఆస్పత్రిలో పనులు త్వరగా పూర్తిచేయాలని ఇప్పటికే దాదాపు రూ. కోటి వరకు సొంత నిధులు వెచ్చించామని, అవసరమైతే మరింత సమకూర్చుతామని సూచించారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

కళ్యాణదుర్గంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పొంక గ్రామంలో ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు, సాకే పెద్ద యర్రిస్వామి, కావడి చంద్ర, కావడి మనోజ్ పాల్గొన్నారు.

● ఉరవకొండ: పట్టణంలో ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుని చిత్రపటాన్ని ఊరేగించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ...

గుంతకల్లుటౌన్ జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇల్లూరు భవనంలో జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలమి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

● తాడిపత్రి: పట్టణంలోని 228వ పోలింగ్ బూత్ వద్ద శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను నిర్వహించారు. బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ, గంగాధర్‌యాదవ్, కృష్ణమోహన్, రాంబాబు, శేషానందరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సర్ థామస్ మన్రో వర్ధంతి

గుత్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వద్ద ఉన్న బ్రిటిష్ సమాధుల్లో అప్పటి దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో 265వ వర్ధంతిని గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ చౌదరి, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాష, గైడ్ రమేష్, నాయకులు సుధాకర్ నాయుడు, దస్తగిరి పాల్గొన్నారు.

రిటైర్డ్ తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓ తదితరులు

శెట్టూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు ఈశ్వరయ్య శెట్టి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనతో పాటు ఆయన భార్య భాగ్యలక్ష్మిని స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, విశ్రాంత డీఎస్ఓ శివశంకర్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధికారి దివాకర్, కంబదూరు తహసీల్దారు బాలకిషన్, పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి

గుంతకల్లుటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని టీడీపీ, పట్టణ పౌరుల సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జింకల జగన్నాథ్, చికెన్ జగన్, ఓ చంద్రయ్య, కృష్ణానాయక్, మహదేవ్, దశరథరామ్, వీరేష్, ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తాగునీటి ట్యాంక్

కంబదూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు అతిథి గృహం వెనుక 30 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నీరంతా లీకేజీ అవుతోంది. ఈ ట్యాంక్ చుట్టూ పక్కాగృహాలు ఉన్నాయి. దీంతో ఈ ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని వారు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ట్యాంక్ పూర్తిగా నెర్రెలు చీలి నీళ్లతో పూర్తిగా పాచిపట్టింది. సిమెంట్ అంతా లేచిపోయి ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. పదేళ్ల నుంచి ఇలా శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారే తప్ప.. మరమ్మతులు చేయించలేదని స్థానికులు వాపోతున్నారు. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ట్యాంక్



నెర్రెలు చీలిన పిల్లర్



కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం



గుంతకల్లు: నక్కనదొడ్డి పీర్ల మకాన్‌లో ఫాతెహా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



ఉరవకొండ : అమిద్యాలలో పీర్లకు వెండి గుర్రం ఇస్తున్న రుషేంద్ర, ప్రశాంతి



యల్లనూరులో దస్తగిరిస్వామి ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మొహర్రం వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వగ్రామమైన నక్కనదొడ్డిలోని పీర్ల చావడిలో చక్కెర చదివించారు. పీర్ల నూతన చావడి నిర్మాణం కోసం బళ్లారి ఎమ్మెల్యే నాగేంద్ర, గుమ్మనూరు నారాయణ స్వామి సంయుక్తంగా అందజేసిన రూ. 5 లక్షలను ఎమ్మెల్యే మకాన్ నిర్వాహకులకు అందజేశారు. గుత్తిలో బారే ఇమామ్ పీర్లస్వాములను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. ఉరవకొండ మండలంలో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అమిద్యాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రుషేంద్ర, ప్రశాంతి దంపతులు వెండితో తయారు చేయించిన వెండి గుర్రం, శంకు చక్రాలను పీర్లకు అందించారు. గుంతకల్లులో ఊరేగింపు నిర్వహించారు. సాయం త్రం పీర్ల స్వాములు జలధికి వెళ్లాయి. యల్లనూరు దస్తగిరిస్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పీర్లు జలధికి తరలివెళ్లాయి. యాడికిలో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. అలాగే పుట్లూరు, రాయదుర్గం, బొమ్మనహాళ్, కూడేరు, బెళుగుప్ప, పెద్దవడుగూరు మండలాల్లోనూ మొహర్రం వేడకలు నిర్వహించారు.



యాడికిలో కొలువుదీరిన పీర్లు



గుత్తి మండలం బేతాపల్లిలో పీర్ల స్వాములు



రాయదుర్గం: చదంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



కూడేరు: ఉదిరిపికొండలో పీర్ల స్వాములు



బెళుగుప్పలో కొలువుదీరిన పీర్లు

అధికారులూ.. తీరు మార్చుకోండి: ఎమ్మెల్యే



మలయనూరులో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని



రాయదుర్గంలో పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ



కొండాపురంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కుందుర్పి, జూలై 6(ఆంధ్రజ్యోతి): కొందరి అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులకు పథకాలు అందడం లేదని, దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, ఇకనైనా అధికారులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హెచ్చరించారు. మండలంలోని మలయనూరు, వడ్డేపాలెం, శ్రీముజ్జనపల్లి, నాగేపల్లి గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం నిర్వహించారు. మలయనూరు గ్రామంలో మానసిక వికలాంగురాలికి సదరం స్లాట్ బుకింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను కూర్చోబెట్టుకుని సదరం స్లాట్ అక్కడే బుక్ చేయించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనుంజయ, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ శ్రీరాములు, మండల మాజీ కన్వీనర్ కర్తనపర్తి రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ రవి తదితరులు పాల్గొన్నారు.

● మీ ఇళ్లను కూల్చనివ్వను : విప్

రాయదుర్గం: సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక చంద్రబాబుకాలనీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు పంపిస్తున్నా.. వాటి గురించి ఎవ్వరూ ఆలోచన చేయాల్సిన అవసరం లేదన్నారు. అధికారులతో మాట్లాడతానని అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి కూడా సమస్య తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఇళ్లను కూల్చకుండా చూసే బాధ్యత తనదని, అవసరమైతే మీ ఇంటి ముందు తాను కూర్చుని అడ్డుకుంటానని స్పష్టం చేశారు. ఒకవేళ రైల్వే వంతెనకు అడ్డుగా ఏమైనా ఇల్లు ఉంటే ఆ ప్రాంతంలో వారికి అనువైన స్థలాలను ఎంపిక చేసి ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. అపార్ట్‌మెంట్‌లోనైనా వారికి కొత్త భవనాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. నచ్చిన చోట ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే ఇల్లు ఖాళీ చేయిస్తారని, అప్పటి వరకు స్వేచ్ఛగా ఉండవచ్చని అన్నారు.

● గుంతకల్లు: నక్కనదొడ్డిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, సర్పంచు వరలక్ష్మి, బండారు రామన్న చౌదరి పాల్గొన్నారు.

● పుట్లూరు : ఏ. కొండాపురంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇందులో చంద్రదండు అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, సర్పంచు వనజమ్మ పాల్గొన్నారు.

45 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమావేశం



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

యాడికి, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో 1979-80లో పదో తరగతి చదివిన 30 మంది విద్యార్థులు.. 45 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన సమయంలో భోజనం తినడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన పూర్వవిద్యార్థులు సుమారు రూ.5 లక్షలతో షెడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, సుమన్ టీవీ జిల్లా ఇన్‌చార్జ్ కంచం ప్రభాకర్‌రెడ్డి, కళాకారుడు సాదు శేఖర్, ధృవనారాయణ, సుమతి, జనార్ధనశర్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



కుందుర్పిలో బ్యాంకు వద్ద స్తంభించిన ట్రాఫిక్

కుందుర్పిలో ట్రాఫిక్ సమస్య

కుందుర్పి, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో ఈ సమస్య వస్తోంది. అయినా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



కళ్యాణదుర్గం: అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి



బొమ్మనహాళ్: ఉంతకల్లులో...

ఘనంగా ఏకాదశి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరవకొండలోని పాండురంగస్వామి ఆలయంలో పాండురంగ, రుక్మిణీదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి.. ఉత్సవమూర్తులను ఊరేగించారు. రాయదుర్గం పట్టణం శాంతినగర్‌లో శ్రీరుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ మూర్తులను రథంలో ప్రతిష్ఠించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే పెద్దవడుగూరులోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని శ్రీ రుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో, గుత్తిఆర్ఎస్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, కళ్యాణదుర్గం పట్టణం కోటవీధిలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో, కణేకల్లులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, యాడికిలోని పాండురంగస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.









పెద్దవడుగూరులో శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి, ఉరవకొండలో గరుడవాహనంపై స్వామి, అమ్మవారు, గుత్తిలో వెంకటేశ్వరస్వామి, యాడికిలో పాండురంగస్వామి

క్రైం న్యూస్..

బేల్దారి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ఏరియాలో నివాసముంటున్న బేల్దారి చాంద్‌బాషా ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన అతను పట్టణ శివారులో రైలుపట్టాలపై ఉండగా.. రైలు ఢీకొంది. లోకోపైలట్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన చాంద్‌బాషాను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బళ్లారి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి లచ్చానిపల్లి వద్ద ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. కొత్తపల్లి శివారులోని 67వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొనడంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ ఖమరంఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే లచ్చానిపల్లికి చెందిన ఆంజినేయులు బైక్‌పై గుత్తికి వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.15200 నగదు స్వాధీనం చేసుకున్నామని, వారిని రిమాండ్ తరలించామని తెలిపారు.

నెట్టికంటి సన్నిధిలో కలెక్టర్



కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, ధర్మకర్త

గుంతకల్లుటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులకు శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

తాగునీరు కలుషితం కాలేదు



ల్యాబ్ రిపోర్టుపై చర్చిస్తున్న పీహెచ్ ఇంజనీర్లు, కమిషనర్

గుంతకల్లు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన కొందరు వాంతులతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారని, దానికి మున్సిపాల్టీ సరఫరా చేసిన నీరు కారణం కాదని పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీరు రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘటనపై ఆయన ఆదివారం గుంతకల్లుకు విచారణకు వచ్చారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటును, నీటి శుద్ధి కార్యక్రమాన్ని తనిఖీచేశారు. అనంతరం తిలక్‌నగర్ కాలనీని పరిశీలించారు. మునిసిపల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. తాగునీరు కలుషితం కాలేదని, ఈ మేరకు కర్నూలు ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చిందని పీహెచ్ ఎస్ఈ తెలిపారు. ఆహారం కలుషితం కారణంగా తిలక్ నగర్ వాసులు అనారోగ్యం బారినపడి ఉంటారని వెల్లడించారు. కార్యక్రమంలో పీహెచ్ ఈఈ ఆదినారాయణ, గుంతకల్లు మునిసిపల్ ఇంజనీరు ఇంతియాజ్, డీఈఈ షబానా, ఏఈ సుదర్శన్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

బ్రహ్మసముద్రం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరింది. పది సంవత్సరాలుగా అనేక మంది ప్రమాదాలకు గురై గాయపడ్డారు. ఈ రోడ్డు దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో రెండు రోజుల నుంచి ఆ రోడ్డుపై గుంతలు పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది